నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | నవంబర్ 19, 2024 | www.navatelangana.com

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

నవతెలంగాణ-తాండూర్

పోలీసులు దొంగతనం కేసును 24 గంటల్లో ఛేదించి నిందితున్ని సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఆదివారం పెగడపల్లి గ్రామానికి చెందిన చిప్పకుర్తి తిరుపతి ఇంట్లో దొంగ తాళం పగులగొట్టి 81 గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు విచారణలో భాగంగా సీఐ కుమారస్వామి నిందితుడు వేల్పుల సిద్దార్థ్‌ను అరెస్ట్ చేశారు. బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ కిరణ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ మనోహర్, పీసీలు శ్రీనివాస్, మల్లేష్‌ను ఏసీపీ అభినందించారు.



పెద్దపులి సంచారంతో భయాందోళనలు

నవతెలంగాణ-నార్నూర్

రెండు రోజుల నుంచి మండలంలో పెద్దపులి హల్‌చల్ చేస్తోంది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. సోమవారం గుంజాల గ్రామ శివారులో పెద్దపులి సంచరించినట్లు గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు తెలిపారు. వారు వేలి ముద్రలను గుర్తించారు. గుంజాల నుంచి తాడిహత్నూర్ సుంగాపూర్, చోర్గావ్ శివారులో పులి ఉన్నట్లు పుకార్లు వినిపిస్తున్నారు. ఆవుపై పులి దాడి చేసినట్లు చర్చించుకుంటున్నారు. పెద్ద పులి కలకలంతో పత్తి ఏరుకునే సమయంలో రైతులు, కూలీలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పొలాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. రెండు రోజుల ముందే అటవీ అధికారులు శివారులో ప్రాంతాల పొలాలకు వెళ్లొద్దని సూచించారు.



సర్వేకు ఆటంకాలు..!

- జిల్లాలో నెమ్మదిగా సాగుతున్న సమగ్ర సర్వే
- కొన్ని చోట్ల ఇండ్లకు తాళాలు ఉండటంతో ఇబ్బంది
- పల్లెల్లో కొంత నయం..పట్టణాల్లో మరింత ఆలస్యం
- వివరాలు చెప్పడంలోనూ కొందరి నిరాకరణ
- ఇబ్బందులు పడుతున్న ఎన్యూమరేటర్లు
- క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

కుటుంబ సంపూర్ణ వివరాలు సేకరించేందుకు తలపెట్టిన సమగ్ర కుల గణన సర్వేకు పలు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రారంభించి తొమ్మిది రోజులు గడుస్తున్నా ఇంకా ఓ కొలిక్కిరావడం లేదు. పల్లెల్లో పర్వాలేదనిపించినా.. పట్టణాల్లో మాత్రం ఆలస్యంగా కొనసాగుతోంది. అనేక చోట్ల ఇండ్లకు తాళాలు ఉండటం.. మరికొందరు ఆర్థికంగా స్థితిమంతులుగా ఉన్న వారు వారి సమగ్ర వివరాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ఆయా కుటుంబాల సమగ్ర వివరాలు నమోదు చేసేందుకు ఎన్యూమరేటర్లు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కులాలకు సంబంధించి కోడ్‌లను కూడా నమోదు చేయాల్సి ఉండటంతో జాబితాలో వాటిని వెతికేందుకు సమయం పడుతోంది. ఒక ఊరిలో ఒక రోజుకు ఒక్కో ఎన్యూమరేటర్ పది నుంచి పదిహేను కుటుంబాల సర్వే మాత్రమే చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోపక్క ఈ సర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉన్నతాధికారులు రోజువారీగా వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ పర్యవేక్షిస్తున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం ఇంటింటి సమగ్ర వివరాలు తెలుసుకునేందుకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను చేపడుతోంది. వివరాలు నమోదు చేసేందుకు గ్రామాల వారీగా ఎన్యూమరేటర్లను నియమించారు. వీరిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా సూపర్‌వైజర్లను నియమించారు. తొలుత మూడు రోజుల పాటు ఇంటింటికి స్టిక్కర్లు వేసిన సిబ్బంది.. ఈ నెల 9వ తేదీ నుంచి కుటుంబాల వారీగా వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. 75ప్రశ్నలకు సంబంధించి సమాధానాలను నిర్దేశిత ప్రొఫార్మాలో నమోదు చేస్తున్నారు. ప్రజల నుంచి ఆధార్, రేషన్‌కార్డు, ధరణి పాస్‌బుక్ తదితర వాటి వివరాలను నమోదు చేస్తున్నారు. కులం, ఉప కులాల కోడ్‌లను సైతం అందులో పొందుపరుస్తున్నారు. వీటితో పాటు చదువు, భూములు తదితర వాటిని నమోదు చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 1,71,784 నివాసాలు ఉండగా ఈ తొమ్మిది రోజుల వ్యవధిలో 1,06,973 నివాసాలకు సంబంధించి వివరాలను సేకరించారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో 44,392 నివాసాలు ఉండగా 21,918 నివాసాలకు సంబంధించిన సర్వేను పూర్తిచేసినట్లు అధికారులు చెబుతున్నారు.



కొన్ని చోట్ల ఆటంకాలు..!

జిల్లాలో సమగ్ర సర్వే కొన్ని చోట్ల సాఫీగా కొనసాగుతుండగా.. మరికొన్ని చోట్ల మాత్రం ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 నుంచి 170వరకు నివాసాలు కేటాయించడంతో వారు రోజువారీగా కొన్ని ఇండ్ల చొప్పున సర్వే చేపడుతున్నారు. ఈ క్రమంలో కొన్ని ఇండ్లకు తాళాలు ఉండటంతో వారి వివరాలు నమోదు చేయలేకపోతున్నారు. మరికొన్ని చోట్ల వృద్ధులు ఉండటంతో వారికి ఇంట్లో పత్రాలు లభించకపోవడం.. వివరాలు సైతం పూర్తిగా ఇవ్వలేని పరిస్థితి ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా పేదలు మాత్రం మరిన్ని పథకాలు వర్తిస్తాయనే ఆశతో ఈ సర్వేకు అన్ని వివరాలు అందజేయగా.. కొందరు ఆర్థికంగా స్థితిమంతులుగా ఉన్న వారు వారి పూర్తి వివరాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. మరికొందరు భూములు తక్కువగా చేసి చూపిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో పూర్తి వివరాలు నమోదు చేయడంలో ఆటంకాలు ఎదుర్కొంటున్నట్లు ఓ ఎన్యూమరేటర్ ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క టీచర్లు మధ్యాహ్నం నుంచి సర్వే చేపడుతుండటంతో రోజుకు 7 నుంచి 10 ఇండ్లు మాత్రమే పూర్తవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలనే ఆదేశాలు ఉండగా నెమ్మదిగా సాగుతుండటంతో గడువులోపు పూర్తవుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క ఈ సర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న ఉన్నతాధికారులు రోజువారీగా ఏదో ఒక ప్రాంతానికి వెళ్లి సర్వేను తీరును పర్యవేక్షిస్తుండగా.. సర్వేను నిరంతరం పర్యవేక్షించాల్సిన సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయికి వెళ్లడం లేదనే ఆరోపణలున్నాయి. కేవలం ఫోన్ల ద్వారా మాత్రమే తెలుసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎన్యూమరేటర్లకు సర్వేలో ఏదైనా సమస్య ఎదురైతే ఎవరికి చెప్పాలో తెలియక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది.

ఎఫ్‌టీఎల్ పరిధిలోని రేకుల షెడ్లు కూల్చివేత



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోగల సర్వే నం.64లోని చెరువు ఎఫ్‌టీఎఫ్ పరిధిలోని 7రేకుల షెడ్లను జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు సోమవారం జేసీబీతో కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చెరువుల పరిధిలో అక్రమ కట్టడాలు నిర్మిస్తే కూల్చివేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సతీష్, టౌన్ ప్లానింగ్ అధికారి యశ్వంత్, ఆర్ఐ మాంతయ్య పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-నార్నూర్

యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కాంగ్రెస్ మండల నాయకురాలు కుమ్రం సింధు అన్నారు. మండలంలోని గుంజల గ్రామపంచాయతీలో శ్రీసంత్ తుకడోజీ మహారాజ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి సోమవారం బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి ఆదిలాబాద్ రూ.10051, రెండో బహుమతి నారాయణ్‌పూర్ రూ.7500, మూడో బహుమతి మత్తడి రూ.5051, నాలుగో బహుమతి వాగ్దరీ రూ.4051 గెల్చుకున్నాయి. బెస్ట్ ప్లేయర్ అవార్డుకు రూ.1000 అందజేశారు. కార్యక్రమంలో గ్రామపటేల్ కుమ్రం లక్ష్మణ్, మాజీ సర్పంచులు కుమ్రం న్యానేశ్వర్, కొట్నాక్ కృష్ణ, సార్మేడి కుడ్మేత నాగోరావ్, బొజ్జుగూడ పటేల్, పెందూర్ డిగంబర్, రాంశావ్ మహారాజ్, గుణవంత్‌రావ్, పాండు, జంగు, గంగారాం, రాజేశ్వర్, విట్టల్, ధనరాజ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి



నవతెలంగాన-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎంఎ ఫయీమ్ అన్నారు. ఆదిలాబాద్ పర్యటనలో భాగంగా కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పూల బొకేలు అందించి శాలువాలతో సత్కరించారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఆయన శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సాయిచరణ్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ కౌన్సిలర్ జఫార్ అహ్మద్, నాయకులు పోరెడ్డి కిషన్, ఎం.ఏ కయ్యుమ్, సింగిరెడ్డి రాంరెడ్డి, కొండూరి రవి, షేక్ మన్సూర్, రావుల సోమన్న, అశోక్ పాల్గొన్నారు.

ఎంజీపీ గురుకులానికి ఇన్వర్టర్ అందజేత

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకులానికి బీజేపీ నాయకులు సోమవారం ఇన్వర్టర్‌ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంజీపీ ప్రిన్సిపాల్ రంగన్న మాట్లాడుతూ రాత్రి సమయంలో విద్యుత్ లేనప్పుడు విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందులు పడేవారని, ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మండల బిజెపి నాయకులు ఇన్వర్టర్‌ని విరాళంగా అందజేశారన్నారు. దీనికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దత్త నిక్కం, వట్టిపెల్లి ఇంద్రశేఖర్, గణేష్, రాకేష్, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

నవతెలంగాణ-కుభీర్

కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్న వ్యక్తి సోమవారం పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని డోడర్నా తండా-2కు చెందిన జాదవ్ గులాబ్ నాయక్ కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి భరించలేక సోమవారం పురుగులమందు తాగాడు. వెంటనే గమనించి భైంసా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కొడుకు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రసాద్ స్కీంలో బాసరకు చోటేది...?

నవతెలంగాణ-ముధోల్

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రసాద్ స్కీంలో చోటు దక్కకపోవడంపై భక్తులు, స్థానికులు మండిపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రసాద్ స్కీం కింద ఆయా రాష్ట్రాల్లో పురాతన, చరిత్ర కలిగిన ఆలయాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలతో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఈ నిధులను ముందుగానే జిల్లా కలెక్టర్ వద్ద అందుబాటులో ఉంచుతారు. ఈ నిధులతో ఆలయ అభివృద్ధి, భక్తులకు సౌకర్యాలను ఏర్పాటు చేస్తారు. అయితే ఈ స్కీం కింద తెలంగాణలో కేవలం జోగులాంబ, రామప్ప రామలింగేశ్వర, భద్రాచలం ఆలయాలకు కేంద్ర ప్రభుత్వం రూ.143కోట్లు మంజూరు చేసింది. అయితే ఇందులో బాసర ఆలయం లేకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదిలాబాద్ ఎంపి నగేష్, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ బీజేపీకి చెందినవారు. అయితే బాసర ఆలయానికి కేంద్ర ప్రభుత్వం నిధులు తెస్తానని గతంలో వారు తెలిపారు. త్వరలో బాసర ఆలయం ప్రసాద్ స్కీంకు ఎంపిక అవుతుందని స్థానిక బిజెపి నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కానీ తాజాగా ఆలయాలను ఎంపిక చేసిన జాబితాలో బాసర ఆలయం ఎంపిక కాకపోవడంతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందలేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే గత ప్రభుత్వం మంజూరు చేసిన కోట్లాది నిధులు వెనక్కి వెళ్లడంపై కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నిధులను వెంటనే కేటాయించాలని కోరారు. కానీ ఇంకా నిధులు రాలేదని తెలుస్తోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీంలో బాసర ఆలయానికి చోటు కల్పించడకపోవడంపై భక్తులకు, స్థానికులకు, నిరాశ మిగిలింది. ఇకనైనా ప్రజాప్రతినిధులు పట్టుదలతో వ్యవహరించి రాష్ట్రం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీంలో బాసర ఆలయానికి చోటు కల్పించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



సహకార సంఘాలకు నాణ్యమైన సేవలందించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-మంచిర్యాల

గ్రామీణ స్థాయిలో ఉన్న సహకార సంఘాల సభ్యులకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా వికసిత భారత్‌కు పునాది ఏర్పడుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని యూనివర్సల్ అర్బన్ సహకార బ్యాంక్ సమావేశ మందిరంలో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా సహకార శాఖ అధికారి బి.సంజీవరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా సహకార మంత్రిత్వ శాఖ ద్వారా 56 అంశాలలో సహకార రంగానికి అత్యంత ప్రాధాన్యత కల్పించడం జరిగిందని, అన్ని రకాల సహకార సంఘాలకు సరైన ప్రాధాన్యత కల్పించడిందని తెలిపారు. సంఘాలు పరస్పర సహకారంతో ప్రగతి పథంలో రాణించాలని తెలిపారు. ప్రభుత్వం నుండి అందించవలసిన అన్ని రకాల సేవలను అందించేందుకు జిల్లా సహకార శాఖ సిద్ధంగా ఉందని, గోదాములు, పెట్రోల్ బంక్లు, ఖాళీ స్థలాలు అందించేందుకు అనుకూలంగా ఉన్నామని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు సోలార్ పరిశ్రమలు, క్యాంటీన్లు తదితరాలు ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లాలో ప్రగతి కనబరిచిన సంఘాలకు జ్ఞాపికలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విశిష్ట కాకతీయ సహకార శిక్షణ కేంద్రం-వరంగల్ ప్రిన్సిపల్ లూనవత్ యాకూబ్ నాయక్, బ్యాంక్ చైర్మన్ వినయ్‌మార్, సిఈఓ మూర్తి, సహకర శాఖ అధికారులు కె.రవీందర్‌రావు, మల్లారెడ్డి, హన్మంతరెడ్డి, రవికిషోర్, సందీప్‌కుమార్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, కార్యదర్శులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలో రాజీవ్‌నగర్ సర్వీస్ రోడ్డుపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. పట్టణ ఎస్ఐ ముత్తే ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. దొరగారిపల్లెకు చెందిన ముల్కల్ల ఉదయ్(30) మంచిర్యాల నుండి దొరగారిపల్లెకు వెళ్లే క్రమంలో అదే గ్రామం నుండి పత్తి నరసింహ(35) మంచిర్యాలకు భార్యతో కలిసి వాహనంపై వస్తున్నాడు. రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. నరసింహ భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఉదయ్ సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఒకేసారి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుము కున్నాయి.

పుట్టబోయే బిడ్డను చూసేందుకు వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి

ం ో డ ్ ్ ప్రమాదంలో మృతి చెందిన ఉదయ్ భోపాల్ రాష్ట్రంలో ఇండియన్ ఆర్మీలో సోల్జర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. 2 0 2 2 ల ో మంచిర్యాలలోని ఎల్ఐసీ కాలనీకి చెందిన పావనితో వివాహం జరిగింది. గర్భం దాల్చిన పావని డెలివరీ సోమవారం ఉండగా భర్త ఉదయ్ డెలివరీ సమయంలో భార్య పక్కన ఉండి పుట్టబోయే బిడ్డను చూడాలనే కోరికతో ఉద్యోగానికి నెల రోజులు సెలవు పెట్టి ఇంటికి వచ్చాడు. ఇంటికి వచ్చిన వారం రోజుల వ్యవధిలోనే ఉదయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది. తెల్లారితే డెలివరీ అయి పుట్టబోయే బిడ్డతో సంతోషంగా గడపాల్సిన ఉదయ్ తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు, భార్య పావని రోధించిన తీరు అక్కడి వారిని కలిచి వేసింది.





భార్య పావనితో ఉదయ్

టీపీటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం సోమవారం జిల్లా అధ్యక్షులు బొడ్డు రామేశ్వర్ అధ్యక్షతన జరిగింది. దీనికి గుంటి ఎల్లయ్య, ఆత్రం భుజంగురావు ముఖ్యాతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సరలుగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బొడ్డు రామేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మర్సుకోలా జ్ఞానేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులుగా మెస్రం మారుతి, రాథోడ్ సాగర్, అర్క ఇందిరా, గంగాసాగర్, జాదవ్ గోపాల్, కార్యదర్శులుగా జితేందర్, పంద్ర జ్యోతిరాం , కైలాష్, గోద్రు, దుర్వ జంగు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బీసీలకు ప్రభుత్వం అన్యాయం : మాజీ మంత్రి రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత బీసీలకు తీరని అన్యాయం చేస్తోందని, బీసీ రిజర్వేషన్లపై కమిషన్‌ల పేరిట కాలయాపన చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. ఈ ఏడాది మార్చిలో బీసీ కమిషన్ ఏర్పాటుపై అసెంబ్లీలో తీర్మానం చేస్తే సెప్టెంబర్‌లో కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. డెడికేషన్ కమిషన్ కాకుండా మాములు కమిషన్ వేసి చేతులు దులుపుకున్నారని హైకోర్ట్ అక్షింతలు వేస్తే తాజాగా నవంబర్‌లో మరో డెడికేషన్ కమిషన్ వేశారని అన్నారు. రిజర్వేషన్లు తదితర అంశాలపై ట్రిబుల్ టెస్ట్ ప్రాతిపదికన అని గతంలోనే సుప్రీం కోర్టు అనేక మార్లు తీర్పు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తాజాగా బీహార్ సర్వే రిపోర్ట్‌ను సైతం న్యాయస్థానం కొట్టివేసిందన్నారు. ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం కారణంగా బీసీలు రిజర్వేషన్లకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. డెడికేషన్ కమిషన్ ఏ శాఖతో సమన్వయం చేసుకోవాలన్న అంశంపై స్పష్టత లేదని, ఇప్పటివరకు సమీక్ష సమావేశాలు, పర్యటనలు జరపకపోవడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేకు, కమిషన్‌కు ఎటువంటి సంబంధం లేదన్నారు. కమిషన్ సభ్యులు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి సర్వే జరిపితేనే స్పష్టత వస్తుందన్నారు. బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తున్న ప్రభుత్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. నలభై రెండు శాతం రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. కమిషన్‌ల పేరిట కాలయాపన చేయకుండా బీసీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నేరవేర్చాలన్నారు. సమావేశంలో బిసి పట్టణ అధ్యక్షుడు దాసరి రమేష్, మాజీ ఎంపిపి జగదీశ్, కౌన్సిలర్ అశోక్, భూమన్న ఉన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | నవంబర్ 19, 2024 | www.navatelangana.com

పసుపు పంటలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

నవతెలంగాణ-నిర్మల్ రూరల్



మండలంలోని ముజిగె గ్రామంలో సోమవారం పొలంబడి కార్యక్రమంలో పసుపు పంటలో యాజమాన్య పద్ధతులపై డ్రీమ్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ చిన్నయ్య మాట్లాడుతూ మొదటగా పసుపు విత్తే ముందు ట్రైకోడెర్మా విరిడీతో విత్తన శుద్ధి చేసుకుని బోదె సాళ్ళ పద్ధతిలో విత్తుకోవాలని సూచించారు. రైతులు పసుపులో మొక్కజొన్న అంతర పంటగా వేస్తారని రెండు సాళ్ళ పసుపుకు ఒక సాలు మొక్కజొన్న వేయాలన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సెక్టోరియల్ అధికారి జి.నారాయణ సూచించారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమం అమలు పర్యవేక్షణలో భాగంగా సోమవారం మండలంలోని అంకోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగించారు. విద్యార్థులు స్వయంగా పాటిస్తూ తమ కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి సుజాత్ ఖాన్, వైద్యాధికారి సర్ఫరాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

- పరీక్షకు 3731 మంది గైర్హాజరు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు రెండు రోజుల పాటు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షల నిర్వహణ కోసం మొత్తం 29 కేంద్రాలను ఏర్పాటు చేయగా రెండో రోజు సోమవారం పేపర్-3 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పరీక్ష జరిగింది. 10 వేల 255 మంది అభ్యర్థులకు గాను 6524 మంది హాజరు కాగా 3731 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. 63.62 శాతం హాజరు నమోదైంది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనల మేరకు అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. సిబ్బంది వారిని క్షుణ్ణంగా తనిఖీలు చేసి హాల్ టికెట్ పరిశీలించి లోపలకి అనుమతించారు. సెంటర్ల వద్ద 144 సెక్షన్ విధించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించారు. అటు స్క్వాడ్‌లు అబ్జర్వర్లు ఆయా కేంద్రాల్లో సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి కాపీయింగ్‌కు పాల్పడకుండా పకడ్బందీగా పరీక్ష జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంది.

బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకుల అందజేత



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మండలంలోని రాజురా గ్రామానికి చెందిన దావత్ పోశెట్టి వారం క్రితం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఇంట్లో ఉన్న వస్తువులతో పాటు 25 క్వింటాళ్ల పత్తి పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఒడ్డేపల్లి కృష్ణంరాజు, తన ఓకేర్ మిత్ర బృందం ద్వారా దుస్తులు, నిత్యావసర సరుకులను బాధితులకు అందించి ఉదాహరణ చాటుకున్నారు. కార్యకార్యక్రమంలో సభ్యులు భీమన్న, దూడంశ్రీనివాస్, ఆడేపు రవి, మడిగేలా అనిల్, సంగర్తి రాజన్న, సాగర్, విజయ్, బొజ్జ వెంకటేష్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీజేపీ అభ్యర్థుల తరఫున ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం వర్ధ ఎమ్మెల్యే అభ్యర్థి పంకజ్ బోయర పట్టణంలో ఆయన ప్రచారం నిర్వహించి పార్టీని ఆదరించలని కోరారు. మహారాష్ట్రలో మరోసారి బీజేపీ అధికారంలో రావడం ఖాయమన్నారు. ప్రజల నుంచి బీజేపీ కూటమికి విశేష స్పందన లభిస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కూటమి మోసాలను నమ్మకండని పేర్కొన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులున్నారు.

నేడు ఝరి ఆస్పత్రిలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోనీ ఝరి పీహెచ్‌సీలో యువత ఆధ్వర్యంలో మంగళవారం మేగా రక్తదానం శిబిరం నిర్వహించనున్నట్లు, ఉమ్మడి మండల యువత సహకరించి విజయవంతం చేయాలని లోకారి-కే మాజీ సర్పంచ్ మెస్రం దేవరావ్ అన్నారు. యువత సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఝరి పటేల్ మెస్రం సోము, మాజీ సర్పంచ్ కొడప జాకు, లోకారి గ్రామ పటేల్ మెస్రం భీంరావ్, ఝరి ఆస్పత్రి హెచ్‌ఈఓ రాథోడ్ రవీందర్, పూసం బాజీరావ్, మడావి భారత్, భీంరావ్, కుమ్ర భీంరావ్ ఉన్నారు.

22న సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సబ్ జూనియర్స్ బాలబాలికల జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అడ్డి బోజారెడ్డి, పి.రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-8, 10, 12 విభాగాల్లో బాలబాలికలకు వేరువేరుగా పోటీలుంటాయన్నారు. అర్హత గల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రంతో ఉదయం 9 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు 9492136510 సంప్రదించాలని సూచించారు. పోటీలు నిర్వహించే క్రీడాంశాలు, వయస్సు కట్ ఆఫ్ తేదీలు వెల్లడించారు.

ఘనంగా నానాజీ మహారాజ్ పుణ్యతిథి వేడుకలు

నవతెలంగాణ-బేల

మండలంలోని కాప్సీ గ్రామంలో నానాజీ మహారాజ్ 128వ పుణ్యతిథి వేడుకలను సోమవారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా నానాజీ మహారాజ్ శిష్యులతో కలిసి గ్రామంలోని ప్రధాన విధులు గుండా మహారాజ్ పల్లకితో భజన కీర్తనలు, భక్తి పాటలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో నానాజీ మహారాజ్ భక్తులు వైద్య విఠల్, జక్కుల మధుకర్, దిలీప్ బెదొడ్కర్, సంతోష్ పాటిల్, అవినాష్ బెదొడ్కర్, గెడం ఉద్ధవ్, వైద్య జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

28న సీఐటీయూ కార్యాలయ ప్రారంభోత్సవం

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్
- ప్రారంభోత్సవ కరపత్రాల ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలో నిర్మించిన బాసెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రం సీఐటీయూ జిల్లా కార్యాలయాన్ని ఈనెల 28న ప్రారంభించనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ తెలిపారు. ఈ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో కార్యాలయ ప్రారంభోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యులు బృందాకారత్, మాజీ పార్లమెంట్ సభ్యులు మీడియం బాబురావు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ అఖిలభారత కోశాధికారి ఎం.సాయిబాబు, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత హాజరవుతున్నట్లు వెల్లడించారు. కార్మిక పోరాటాల సారథి ఐక్య ఉద్యమాలవారధి కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా కార్యాలయం ప్రారంభమనేది జిల్లా కార్మిక వర్గానికి పండుగ లాంటిదన్నారు. జిల్లా కార్యాలయం ప్రభుత్వాల కార్మిక ప్రజాకర్షక వ్యతిరేక విధానాల పైన పోరాడే వారికి కేంద్రంగా పనిచేస్తుందని తెలిపారు. భవిష్యత్తు జిల్లా కార్మికవర్గ ఉద్యమాలకు వేదికగా నిలబడుతుందన్నారు. ప్రారంభోత్సవ సభకు కార్మికులు ప్రజలు కర్షకులు ఆదివాసులు, కార్మిక ఉద్యమ శ్రేయోభిలాషులు వేలాది సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, కోశాధికారి కే సునీత, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, వెంకటమ్మ, ఎస్ శోభ, లింగాల చిన్నన్న, ముఖినేపల్లి గంగన్న, అగ్గిమల స్వామి, సహాయ కార్యదర్శులు ఎం.సుజాత, పి.జితేందర్, నాయకులు పండుగ పొచ్చన్న, దర్శనాల నగేష్, సోనేరావు, జనార్ధన్, వెంకట్‌రావు, ఆశన్న పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీం
- పలు అంగన్‌వాడీ సెంటర్ల సందర్శన
- రికార్డులు పరిశీలించి సూచనలు చేసి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవసరమైన పిల్లలకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మెన్ ఎంఏ ఫహీం అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన పర్యటించారు. జిల్లాకు వచ్చిన ఆయనకు అధికారులు, కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. ముందుగా పట్టణంలోని మహాలక్ష్మి వాడాలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం భుక్తాపూర్, శాంతినగర్‌లోని కేంద్రాలను సందర్శించి ఇక్కడ అందిస్తున్న సేవల గురించి కేంద్రం టీచర్లను అడిగి తెలుసుకున్నారు. భోజనం, ఇతర సౌకర్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కేంద్రానికి వచ్చిన చైర్మెన్‌కు పుష్పగుచ్చాలు అందించి స్వాగతించి శాలువతో సత్కరించారు. పలు విషయాలను అడిగి తెలుసుకుంటూ బాలామృతం పిల్లలకు విధిగా అందించాలని సూచించారు.

ప్రతి కేంద్రంలో బాలామృతం అమలు చేయాలి

ఈ సందర్భంగా తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మెన్ ఎంఏ ఫహీం మాట్లాడుతూ పౌష్టికాహర లోపంతో బాధపడుతున్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం అందిస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మహిళ శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క సూచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి బాలామృతం పథకాన్ని అమలు చేస్తూ 15 లక్షల మంది ప్రి స్కూల్, ప్రైమరి స్కూల్, ఇన్ఫాంట్ పిల్లలను అందిస్తున్నామని పేర్కొన్నారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ వారు యూనిసెఫ్‌తో కలిసి పైలట్ ప్రాజెక్టు నిర్వహించి పౌష్టికార లోపం నివారణకు ప్రభుత్వానికి నివేధికలు అందించారని తెలిపారు. పౌష్టికాహారం సక్రమంగా అందక చిన్నారుల ఎదుగుదల, బరువు పెరగడంలో సమస్యలు వచ్చాయన్నారు. వాటి నివారణ కోసం సీఎం ప్రతి కేంద్రంలో బాలామృతం అమలు చేయాలని ఆదేశాలు చేశారని, దాని పని తీరును తెలుసుకోవడానికి ర్యాండమ్‌గా అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వినోద్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, డీడబ్ల్యూఓ సబిత, ఏసీడీపీఓ మిల్కా, సీడీపీఓ వనజ, కౌన్సలర్, సిబ్బంది ఉన్నారు.

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీఓ వసంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. జైనథ్ మండలం తారోడా గ్రామానికి చెందిన ఈశ్వర్ తనకి కంప్యూటర్ ఆపరేటర్‌గా నియమించమని, ఉట్నూర్ మండలం తేజాపూర్ గ్రామానికి చెందిన నాగోరావ్ తన ఎడ్ల జత చనిపోవడంపై ఆర్థిక సాయం అందించాలని, తలమడుగు మండలం జర్రి గ్రామానికి చెందిన స్వాతి తనకి బ్యూటీ పార్లర్ కోసం లోన్ ఇప్పించాలని తమ వినతులను అందించారు. అర్జీలను స్వీకరించిన ఏపీఓ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు వాటిని అందించారు. ఇందులో ఏపీఓ(పీవీటీజీ) మెస్రం మనోహర్, పీహెచ్‌ఓ సందీప్ కుమార్, ఐసీడీఎస్ రమాదేవి, జెడీఎం నాగభూషణం, పేసా కోఆర్డినేటర్ వసంతరావు, డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై వర్క్‌షాప్

నవతెలంగాణ-నిర్మల్ టౌన్



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ మోతాదుకు మించి మందులను ఉపయోగించడం వల్ల బ్యాక్టీరియా, వైరస్ పారాసైట్స్, శిలీంద్రాలకు డ్రగ్ రెసిస్టెన్సీ వల్ల ఇన్ఫెక్షన్ తగ్గక, వ్యాధి తీవ్రత పెరిగి, మరణాలు సంభవిస్తాయన్నారు. దీనిని నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. పీహెచ్‌సీల్లో వీటిపై ప్రజలను చైతన్యం తెవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇద్రిస్ గౌరీ, నిర్వాహణాధికారులు రవీందర్ రెడ్డి, సౌమ్య, రాజా రమేష్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, వైద్యాధికారులు, నర్సింగ్ ఆఫీసర్లు, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

పులి బెడద నుండి ఆదివాసులకు రక్షణ కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అటవీ ప్రాంతంలోని ఆదివాసీ ప్రజలకు పులి బెడదా నుండి రక్షణ కల్పించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ కోరారు. రైతుకు పంట చేతికొచ్చిన సందర్భంలో కూలీలు దొరకక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే సమయంలో పులి భయంతో మరింత నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. పంట పొలాలకు వెళ్లాలంటే భయందోళన చెందుతున్నారన్నారు. మహారాష్ట్ర తడోబా, తిప్పేశ్వర్ అటవీ నుండి జిల్లాలోకి వస్తున్న పులులను కట్టడి చేయడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ఇప్పటికే అనేక పశువులకు గాయపరుస్తూ చంపేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ శాఖ అధికారులు తక్షణమే పులి జాడ కనుక్కొని ఆదివాసులకు రక్షణ కల్పించాలని కోరారు.

అరెస్టు అప్రజాస్వామికం



నవతెలంగాణ-నేరడిగొండ

కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల ఎస్సీ, ఎస్టీ రైతుల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. అరెస్టులను ఖండిస్తు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయడానికి హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం నుంచి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు బాల్క సుమన్, జాన్సన్ నాయక్‌తో కలిసి ఢిల్లీ బయలుదేరారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

నార్నూర్ : లగచర్ల బాధిత రైతుల రక్షణ కోసం బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వం చేస్తున్న దాడిని ఖండిస్తూ సోమవారం ధర్నాకు పిలుపు నిచ్చారు. ఈ నేపథ్యంలో మండల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సీఐ రహీమ్ పాషా పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్ ఆడే సురేష్, భీంపూర్ మాజీ సర్పంచ్ రాథోడ్ విష్ణు, గాదిగూడ మాజీ ఎంపీపీ చంద్రకళ రాజు, వైస్ ఎంపీపీ యోగేష్, నాయకులు కాశీం, ఫేరోజ్ ఖాన్, రాథోడ్ సుభాష్‌లను అరెస్టు చేశారు.

20న జిల్లా స్థాయి కబడ్డీ మహిళ జట్టు ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మహిళల జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జాబాడె రాష్ట్రపాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సంబంధిత ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటలకు స్టేడియంలో పోటీల కన్వీనర్ ఉపాధ్యక్షులు విఠల్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి అఖిల్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు.

మహారాష్ట్ర సరిహద్దులో మద్యం బంద్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

మహారాష్ట్రలో నవంబర్ 20న జరిగే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మహారాష్ట్రకు 5 కిలో మీటర్ల సరిహద్దులో మద్యం దుకాణాలు మూసి ఉంచాలని ఎస్పీ జనాకి షర్మిల తెలిపారు. ఏ4 వైన్ షాప్, కల్లు డిపోలు, కల్లు దుకాణాలు, 2బీ రెస్టారెంట్ బార్ 18 నవంబర్ సాయంత్రం 6 గంటల నుండి 20 నవంబర్ ఎన్నికలు ముగిసే వరకు, 23 నవంబర్ రోజు పూర్తిగా ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు మూసి ఉంచాలని కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు ఆఫీసు నుండి ఉత్తర్వులు వెలువడ్డాయని తెలిపారు. సరిహద్దులో గల బాసరలో శారద వైన్ షాప్, కుబీర్‌లో గల హల్దా, రంగేసవిని, పర్డి (బి), మరలగొండ, బేలగావ్, పల్సి, శిరపల్లి, నిగవ, సంవిలీ, మహాలింగి, బామిని, తానూర్‌లో గల బెల్‌తరోడ, బోరిగావ్, మొగిలి, తొండల, దౌలతాబాద్, జవులా, ఎలవత, బాసరలో గల బీదరెల్లి, లాబది కల్లు దుకాణాలు మూసి ఉంచాలని సూచించారు.

క్రియాశీల సభ్యత్వం పొందాలి



నవతెలంగాణ-నేరడిగొండ

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసే ఆశావాహులు 50 సాధారణ సభ్యత్వాలు నమోదు చేసి క్రియాశీల సభ్యత్వం పొందాలని అసెంబ్లీ కన్వీనర్ కదం బాబారావు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంస్థాగత ఎన్నికల వర్క్‌షాప్ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు మాధవ్‌రావ్ ఆమ్టేతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీలో సంస్థాగతంగా ఎన్నికలు త్వరలో జరుగుతాయని ఆ ఎన్నికలకు సంబంధించిన వర్క్‌షాప్‌ను ప్రతి మండలంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంస్థాగత ఎన్నికల్లో పాల్గొనేవారు తప్పకుండా క్రియాశీల సభ్యత్వం కలిగి ఉండాలన్నారు. క్రియాశీల సభ్యత్వం ఉన్న వారికే పోలింగ్ బూత్ అధ్యక్షులుగా అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సాబ్లే సంతోష్ సింగ్, నాయకులు తిత్రే నారాయణ్ సింగ్, గట్టు నారాయణ, చొక్కపల్లి రాములు, జాదవ్ పరుశు రాం, తీగల నవీన్, మెరుగు శ్రీధర్ రెడ్డి, మండాడి కృష్ణ, లక్ష్మణ్, లింగంపల్లి సురేష్, బొంతుకుల శ్రీను, చిమ్మన సతీష్, దూత్వాల రంజిత్, అర్క గంగారాం, సాట్వాయి శ్రీనివాస్, ఏరు రాజేశ్వర్, అబ్దుల్ జమీర్ పాల్గొన్నారు.

ఆలయం కోసం ఆరు గుంటల భూమి దానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జైనథ్ మండలం మాండగడలో నిర్మించిన మురళీకృష్ణ ఆలయానికి గ్రామానికి చెందిన టక్కూర్ నర్సింగ్ తనకున్న భూమిలో నుండి 6 గుంటల భూమిని దానం చేశారు. దీని విలువ రూ.6 లక్షల ఉటుంది. సోమవారం సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అధ్యక్షుడు ప్రమోద్ ఖత్రి ఆయన కార్యాలయంలో నర్సింగ్‌ను శాలువతో సత్కరించారు. దేవాలయాలకు, పూజ కార్యక్రమాలకు ప్రముఖ వ్యాపార వేత్తలు, ప్రజలు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కొత్తపల్లి సంజీవ్, రావుల వేణు, నర్సింలు, మీసాల స్వామి, మురళీ కృష్ణ ఆలయ కమిటీ సభ్యులు ఏనుగు విఠల్ రెడ్డి, అక్కూర్ సంతోష్, అందే సంత కుమార్ పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండల కేంద్రంలోని బెస్తవాడలో పేకాట ఆడుతున్న ముగ్గురి పట్టుకున్నట్టు ఎస్సై కొమురయ్య తెలిపారు. సమాచారం మేరకు సోమవారం సాయంత్రం బెస్తవాడలో పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న చెమ్మకరి తొగయ్య, ఎండీ మసూద్, డబ్బుల వెంకటేష్‌ను పట్టుకుని స్టేషనుకు తరలించారు. వారి వద్ద రూ.21,400 నగదు, మూడు సెల్ ఫోన్లు స్వాధీన చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. వీరిని విచారించగా నలుగురు వ్యక్తులు విశ్వేశ్వర్, మెరుగు రమేష్, నరేందర్ గౌడ్, రాజన్న కూడా ఉన్నారని వారు ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుంటామన్నారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు, పేకాట, క్రికెట్ బెట్టింగ్, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి మూడేండ్ల జైలు

నవతెలంగాణ-దహెగాం

వ్యక్తిపై హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా అసిస్టెంట్ సెషన్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి కే.యువరాజు తీర్పునిచ్చారని ఎస్సై రాజు తెలిపారు. దహెగాం మండలంలోని చిన్న రాస్పెల్లి గ్రామానికి చెందిన సాపిలబాపు 27 అక్టోబర్ 2022న పొలం పనికి వెళ్ళిన సమయంలో అదే మండలంలోని ఒడ్డుగూడా గ్రామానికి చెందిన బుర్సా పోశం పాత కక్షలు మనసులో పెట్టుకొని అతనిపై కత్తితో దాడి చేశాడు. బాధితుడు సాపిలబాపు భార్య సాపిల కల ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సనత్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా పీపీ ప్రసాద్ సాక్షులన ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో హత్యాయత్నం కేసు కింద మూడు సంవత్సరాల జైలు, రూ. వెయ్యి జరిమానా విధించారని తెలిపారు. కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషిచేసిన ప్రస్తుత కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజు, ఆసిఫాబాద్ కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్ రామ్‌సింగ్, కోర్టు సిబ్బంది బాలాజీని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్ష



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో గ్రూప్-3 పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఆసిఫాబాద్ పట్టణంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-3 పరీక్షలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగంగా అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశామన్నారు. 18 పరీక్ష కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. కాగా సోమవారం నాటి పరీక్షకు 4471 మంది దరఖాస్తులు చేసుకోగా 2757 మంది విద్యార్థులు పరీక్ష రాశారని, 1714 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారులు, పరిశీలకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివే విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు గ్రామ పెద్ద బొమ్మెల కిషన్ ముందుకు వచ్చారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా ఈ విద్యార్థులు ఎక్కువ సమయం పాఠశాలలో ఉండాల్సి వస్తుండడంతో వారికి పరీక్షల వరకు సాయంత్రం సమయంలో అల్పాహారం అందించేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు విద్యార్థులకు అల్పాహారం ప్లేట్లతో పాటు అల్పాహారాన్ని ఆయన అందించారు. నిత్యం ఉప్మా, పూరీ, అటుకులు, పాలు, బిస్కెట్‌లు, పల్లీ పట్టీలు, సమోసాలు తదితర అల్పాహారాలను రోజుకు ఒక్కటి చొప్పున అందిస్తానని ఆయన ప్రధానోపాధ్యాయులు ఏటుకూరి శ్రీనివాస్‌రావుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు లింగన్న, కార్తీక్, సత్యనారాయణ, లక్ష్మయ్య, ఉపాధ్యాయులు సత్యనారాయణ, స్వామి, రవికుమార్, అస్మీ అలీ, వనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

గోండ్వాన మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కౌటాల

గోండ్వాన ఆదివాసీ కోయ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోయం చిన్నయ్య అధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని కుమురం భీమ్ భవనంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నైతం బాజీరావ్, అధ్యక్షుడిగా సిడాం అశోక్, ఉపాధ్యక్షులుగా సిడాం సురేష్, ప్రధానకార్యదర్శిగా తలండీ దిలీప్, కార్యదర్శులుగా మడావి సంతోష్, కుడ్మేత ఆత్మరాం, కమిటీ సభ్యులుగా కనక వసంత్, తలండి మధుకర్, వేలాది సంతోష్, కుడ్మెత దిలీప్‌లను ఎన్నుకున్నారు. ఆదివాసుల హక్కులతో పాటు అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. అదే విధంగా నూతనంగా ఎన్నికైన సభ్యులను సత్కరించి అభినందనలు తెలిపారు.

కేజీబీవీల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్-2, స్వీపర్-1, మొత్తం 3 పోస్టుల భర్తీకి 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల గల స్థానిక మహిళ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి వేణుగోపాల్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. స్వీపర్, అసిస్టెంట్ కుక్ పోస్ట్‌కు ఏడవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, తాజ నివాస ధ్రువీకరణ పత్రం, ఏడవ తరగతి పాస్ మెమో, బోనాఫైడ్, ఒక ఫోటో, ఆధార్ కార్డుతో ఈనెల 23న సాయంత్రం నాలుగు గంటలలోపు ప్రతి పోస్ట్‌కు వేరువేరు దరఖాస్తులను విద్యాలయంలో సమర్పించాలని సూచించారు.

రథయాత్ర ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హిందువులను చైతన్య పరచాలనే ఉద్దేశ్యంతో ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రథయాత్ర సోమవారం ప్రారంభమైంది. ఈ యాత్రలో మతమార్పిడి జరగకూడదని హిందువులను చైతన్య పరిచే విధంగా ప్రతి గ్రామంలో యాత్ర సాగుతోందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ధర్మ జాగరణ సమితి ఆసిఫాబాద్ నాయకులు పాల్గొన్నారు.

అరె కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్ ఇవ్వాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణలో ఉన్న ఆరె కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్ ఇవ్వాలని బీజేపీ సీనియర్ నాయకులు కోరారు. సోమవారం మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్ గంగారాం అహెరీని ఆయన నివాసంలో మర్యాదపూర్వక కలిశారు. అరె కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్ గురించి చర్చించారు. దీనిపై చైర్మెన్ సానుకూలంగా స్పందించి సమస్యను త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇందులో సీనియర్ నాయకులు బోనగిరి సతీష్ బాబు, భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రావణ్ గౌడ్, బీజేవైఎం నాయకులు సోమ శ్రీనివాస్ ఉన్నారు.

ప్రతి కుటుంబం మరుగుదొడ్డి కలిగి ఉండాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అధికారులు

జిల్లాలోని ప్రతి కుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్డి కలిగి ఉండాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా అధికారులతో కలిసి ప్రపంచ టాయిలెట్ డే గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి కుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్డిని నిర్మించుకోవాలని, బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని తెలిపారు. ప్రజా ఆరోగ్యం దృష్ట్యా ప్రతి కుటుంబం మరుగుదొడ్డిని కలిగి ఉండాలని, స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్‌లో భాగంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉండేలా అందరు భాగస్వామ్యం కావాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం అలవర్చుకోవాలన్నారు. స్వచ్ఛ ఆసిఫాబాద్ తయారు చేసేల అధికారులు క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన కల్పించాలని సూచించారు. బాధ్యతగా ప్రజలు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఎస్‌బీఎం జిల్లా సమన్వయకర్త నజర్ అహ్మద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి : సీఐటీయూ



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్

నవతెలంగాణ-కెరమెరి

గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రాజేందర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులకు నాలుగు నెలల నుండి వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పొట్ట కూటి కోసం పని చేసే కార్మికులు, వేతనాల కోసం వేచి చూడడం దురదృష్టకరమన్నారు. ఎల్లా వేళలా గ్రామాల్లో పరిశుభ్రత కోసం పాటు పడుతున్న సకాలంలో వేతనాలందక కుటుంబ పోషణ కోసం కార్మికులు పడుతున్న బాధలు వర్ణాతీతమన్నారు. కార్మికుల వేతనాల సమస్యపై పలుమార్లు జిల్లా అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అరకొర వేతనాలు సరిపోవడం లేదన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్మికుల పెండింగ్ వేతనాలు సకాలంలో చెల్లించని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు బుద్దు, గ్రామపంచాయతీ నాయకులు శ్రీనివాస్, తిరుసుల్ల సంతోష్, మల్లేష్, స్వామి, గోపి, వెంకటేష్, శ్రీనివాస్, భుజంగరావు, దత్తు, జైవంత్ రావు పాల్గొన్నారు.

కోత దశ తర్వాత యంత్రాలు వినియోగించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

వరి పొలం పూర్తి కోత దశకు వచ్చిన తర్వాత మాత్రమే యంత్రాలు వినియోగించి పంట కోయించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి వ్యవసాయ, సహకార, గ్రామీణ అభివృద్ధి, పౌరసరఫరాల శాఖల అధికారులు, హార్వెస్టర్ వాహనాల యజమానులతో ఖరీఫ్ వరి కోతలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి కోతలు సాగుతున్నందున హార్వెస్టర్ల యజమానులు పంట పూర్తిగా కోతకు వచ్చిన తర్వాత కోయడం ద్వారా తేమశాతం, తాలు, గడ్డి లేకుండా నాణ్యమైన పంట వచ్చే అవకాశం ఉందని, తద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులుండవని తెలిపారు. రైతు నేస్తం ద్వారా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి కొనుగోలు కేంద్రానికెళ్లి సూచనలివ్వాలని ఆదేశించారు. రైతుల సౌకర్యార్థం జిల్లాలో 34 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించేల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సహకార శాఖ అధికారులు బిక్కు, రబ్బాని, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, వ్యవసాయ శాఖ, పౌరసరఫరాల శాఖ అధికారులు, హార్వెస్టర్ల యజమానులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

- ఎంఈఓ హనుమంతు

నవతెలంగాణ-కౌటాల

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని ఎంఈఓ గావుడె హనుమంతు అన్నారు. సోమవారం మండలంలోని తలోడి ప్రాథమిక పాఠశాలను ప్రార్థన సమయానికంటే ముందే వెళ్లి మండల విద్యాధికారి గావుండే హన్మంతు సందర్శించారు. పిల్లల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. మధ్యాహ్న భోజన మెనూ ప్రకారం అందించాలన్నారు. అనంతరం కస్తూర్బా ఉన్నత పాఠశాలను సందర్శించారు. పిల్లల సామర్థ్యాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. క్లాస్ రూమ్ అబ్జర్వేషన్ చేశారు. డిసెంబర్ 4న జరగబోయే నాస్ టెస్ట్‌కు పిల్లలను సన్నద్ధం చేయాలని తెలియజేశారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని, మరుగుదొడ్లు, పాఠశాల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని, మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం అందించాలని కేజీబీవీ ఎస్ఓ పవిత్రకు సూచించారు. ఆయన వెంట సీఆర్పీ దేవన్న ఉన్నారు.

తీరు మారకుంటే చర్యలు తప్పవు

మధ్యాహ్న భోజనంను పరిశీలించి తీరు మారకుంటే చర్యలు తప్పవని ఎంఈఓ గావుడె హనుమంతు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ కోట ప్రసాద్‌తో కలిసి మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాన్ని తయారు చేసి విద్యార్థులకు వడ్డించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం ప్రతి రోజూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పరిశీలించి విద్యార్థులకు రుచి కరమైన భోజనం పెట్టేలా చూడాలన్నారు. బోజన బియ్యం, కూరగాయలు, సామాగ్రి శుభ్రంగా కడిగి వంట చేయాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా వ్యవహరిస్తే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట కార్యదర్శి సాయి కృష్ణ, సీఆర్పీ దేవన్న ఉన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఐదవరోజు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. దేశ భక్తి, జానపద గేయాలపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు పాటల పోటీలు చేపట్టారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారి ప్రతిభను చూపారు. దీనికి ముఖ్యఅతిథిగా డీఏఓ ఈ.రాజేశ్వర్ హాజరై మాట్లాడుతూ పురాణాలతో పాటు పోటీ పరీక్షల కోసం గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు చూపిన ప్రతిభ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఆర్.రమాదేవి, లైబ్రేరియన్స్ టి.సదానందం, కె.ప్రవీణ, ఎం. స్వర్ణలత, జి.సతీదేవి, ఎం.వెంకటరమణ, స్వీపర్ సలీం, రామయ్య గోపి, పాఠకులు పాల్గొన్నారు.

సివిల్ ఫిర్యాదులు కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలున్న కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాస్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఆయన అర్జీలు స్వీకరించారు. మొత్తం 06 ఫిర్యాదులను స్వీకరించి వాటిని చట్టప్రకారం పరిశీలించాలని సీఐ, ఎస్సైలకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భూములకు సంబంధించి గొడవలు పెట్టుకోవద్దని, సామరస్యంగా మాట్లాడుకొని పరిష్కరించుకోవాన్నారు. అధికారులు బాధితులు తీసుకొవచ్చే ఎలాంటి ఫిర్యాదులైన పెండింగ్‌లో పెట్టొదని సూచించారు. ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంటే వాటికి సంబంధించిన సమాచారాన్ని బాధితులకు తెలియజేయాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని, పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా, భద్రత కల్పించాలన్నారు. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ పెరుగుతున్నందున సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో డయల్ 100 లేదా 1930కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

జీపీ కార్మికుల మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కౌటాల

జీపి కార్మికుల మండల కమిటీని సోమవారం జిల్లా అధ్యక్షుడు మోరేశ్వర్ కమిటీ సభ్యులు మోర్లె నాగేష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇప్ప ప్రకాష్, ఉపాధ్యక్షులుగా కేడికర్ నాగేష్, గోగర్ల సాయి కృష్ణ, కార్యదర్శిగా పిట్టల రవి, సహాయ కార్యదర్శిగా నికోడె వసంత్, సభ్యులుగా ఆదే శ్రీనివాస్, విలాస్, భనిత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామపంచాయతీల్లో కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటి పరిష్కరం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని నూతన కమిటీని నాయకులు సూచించారు.

రేపు తుడుం దెబ్బ మహాసభ

నవతెలంగాణ-జైనూర్

తుడుం దెబ్బ మహాసభను ఉట్నూర్ మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు ఆదివాసీ కోలవార్ సంక్షేమ సంఘం జిల్లా సహాక కార్యదర్శి పోల్క వెంకటేష్ తెలిపారు. తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విలేకరుల సమావేశం నిర్వహించి మహాసభ వివరాలను తెలియజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహాసభను ఉట్నూర్ మండల కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం నూతన తుడుం దెబ్బ జిల్లా కమిటీలతో పాటు డివిజన్, మండల కమిటీలు ఏర్పాటు ఉంటుందన్నారు. మహాసభకు తుడుం దెబ్బ అనుబంధ సంఘాలు, ఆదివాసీ విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగ యువకులు, రైతులు, యువజన సంఘాలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

హై వోల్టేజ్‌తో నష్టపోయిన వారిని ఆదుకోవాలి

నవతెలంగాణ-దహెగాం

హై వోల్టేజ్ కరెంటుతో విద్యుత్ పరికరాలు కాలిపోయి నష్టపోయిన తమను ఆదుకోవాలని బాధితులు సోమవారం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంచవెల్లి సబ్ స్టేషన్ పరిధిలోని కొంచవెల్లి గ్రామంలో ఆదివారం హై వోల్టేజ్ విద్యుత్ సరఫరా కావడంతో గ్రామంలోని చాలా ఇండ్లలో పెద్ద ఎత్తున శబ్దాలు వచ్చాయన్నారు. గ్రామానికి చెందిన కోసారి రావుజి, మద్దెర్ల ప్రవీణ్, గురునులే సురేష్, మామిడి శేఖర్, గొర్నులే భాస్కర్, వెంకటేష్, సతీష్ తదితరుల ఇండ్లలోని ఫ్రిడ్జ్‌లు, టీవీలు, ఫ్యాన్లు, కూలర్లు, సన్ డైరెక్ట్ బాక్సులు ట్యూబ్ లైట్లు కాలిపోయాయని తెలిపారు. ఆర్థికంగా నష్టపోయిన తమకు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బాధితులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అధికారంలోకి రాక ముందు సీఎం రేవంత్ రెడ్డి దివ్యాంగులకు ఇచ్చిన హామీలను విస్మరించారని వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీ) నాయకులు ఆరోపించారు. హామీలను అమలు చేయాలని కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దివ్యాంగుల పెన్షన్ రూ.4016 నుంచి రూ. 6 వేలకు పెంచాలని, ఇతర పెన్షన్లు రూ.2016 నుంచి రూ.4వేలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో దివ్యాంగులకు ఐదు శాతం కేటాయించాలన్నారు. చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు సంవత్సరం కావస్తున్న ఇప్పటికి పూర్తి కాలేదన్నారు. వెంటనే వాటిని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రభుత్వంపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి రేగుంట మహేష్, నాయకులు సాగర్, వీహెచ్‌పీ అధ్యక్షుడు బీ.మూర్తి, రాష్ట్ర నాయకులు ఇస్తాం బిన్ హసన్, శ్రీనివాస్, రాజయ్య, మహేందర్, కోటేశ్వర్‌రావు, తరుణ్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | నవంబర్ 19, 2024 | www.navatelangana.com

కొనుగోలు కేంద్రంలో రైతులకు అవగాహన

నవతెలంగాణ-లక్షెట్టిపేట



వరి పంట కోత అనంతరం రైతులు తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం మండల వ్యవసాయ అధికారి ఆర్ శ్రీకాంత్ రైతులకు అవగాహన కల్పించారు. ఉత్కూరు వరి కొనుగోలు కేంద్రంలో వరి పంట అవశేషాలు కాల్చడంతో కలిగే దుష్ప్రభావాలను రైతులకు వివరించారు. కాల్చడంతో నేల స్వభావం కోల్పోవడమే కకుండా వావరణం దెబ్బతిని శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాధం ఉందని పేర్కొన్నారు. రైతులు సాధ్యమైనంత వరకు పంట అవశేషాలను నేలలో కలియదున్ని ఎస్ఎస్‌పీ వాడడం ద్వారా త్వరగా కుళ్లిపోయి పోషకాలు మొక్కలకు అందే అవకాశం ఉంటుందని, దీంతో పంట ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిని శ్రీనిక పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-లక్షెట్టిపేట

స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు బోధించేంఉదకు అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపల్ రమాకళ్యాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జేఎల్ మ్యాథమెటిక్స్ పోస్ట్ కోసం, ఎంఎస్సీ మ్యాథమెటిక్స్ బీఈడీ, మాథ్స్ మెథడాలజీ అర్హత ఉన్నటువంటి మహిళా అభ్యర్థుల నుంచి 5, 6, 7 తరగతుల విద్యార్థులకు బోధించడానికి ఎమ్మెస్సీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఈడీ, మ్యాథ్స్ మెథడాలజీ కలిగిన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 20న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ సర్టిఫికెట్లతో ఉదయం 10.00 గంటలకు కళాశాలలో డెమో కోసం హాజరు కావాలని కోరారు. జూనియర్ లెక్చరర్ వేతనం రూ. 23,200, టీజీటీ గౌరవ వేతనం రూ.18,200 ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు, ఎంపిక చేయబడిన, సొసైటీ నియమ నిబంధనల ప్రకారం పని చేయాల్సి ఉంటుందని తెలిపారు.

బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక





నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాలరీస్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆర్కే-7 గని కన్వీనర్‌గా తాళ్లపల్లి పవన్, కోకన్వీనర్‌గా గుర్రాల మహేందర్ ఎన్నికయ్యారు. సోమవారం సింగరేణి కాలరీస్ శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-7 గనిలో బీసీ సంక్షేమ సంఘం విభాగం సభ్యులు సమర్థమైన కార్యనిర్వహణ, బీసీ హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల ప్రోత్సాహానికి అంకితమై పనిచేసేందుకు నూతన నాయకత్వాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు ముస్కె సమ్మయ్య, వీరభద్రయ్య మాట్లాడుతూ బీసీ కమ్యూనిటీకి దామాషా ప్రకారం రావలసిన హక్కులు, సౌకర్యాల కోసం ఐక్యంగా పోరాడాలని, కమ్యూనిటీ శ్రేయస్సు కోసం కట్టుబడి ఉంటామని తెలిపారు. మహాసభలను విజయవంతం చేయడంలో ఈ నాయకత్వం కీలక పాత్ర పోషించనున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కిషన్ రావు, అశోక్, తుంగళ రమేష్, గని సీనియర్ అండర్ మేనేజర్ కొత్తపల్లి రవీందర్, బి మారుతి, బద్రి బుచ్చయ్య గండి సతీష్, పారుపల్లి రాజేందర్, గుంపుల రఘురామ్ మహేందర్, సామని సదానందం పాల్గొన్నారు.

సింగరేణి పరిరక్షణకు సంతకాల సేకరణ

నవతెలంగాణ-మందమర్రి



బొగ్గు గనుల వేలం పాటను రద్దు చేసి సింగరేణి సంస్థకే బొగ్గు గనులను కేటాయించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మందమర్రి ఏరియాలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యుడు దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణిని ప్రయివేటుపరం కాకుండా బొగ్గు గనులు సింగరేణికే కేటాయించే విధంగా వారసత్వ పోరాటాలను కొనసాగిస్తూ, సంస్థను కాపాడుకోవల్సిన బాధ్యత యువ కార్మికులపై ఉందని అన్నారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం తెలంగాణలోని బొగ్గు గనులపై ప్రయివేటీకరణ కత్తి పెట్టారని అన్నారు. సంస్థకు కేటాయించాల్సిన బొగ్గు గనులను, వేలంపాట ద్వారా కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలకు పూనుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. తెలంగాణకు సిరుల గనిగా, ఉపాధినిచ్చే వనరుగా, పరోక్షంగా ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న కల్ప తరువుగా ఉన్న సంస్థపై కన్నేసిన బీజేపీ మోడీ ప్రభుత్వం ఆదాని, అంబానీలకు కట్టబెట్టడానికి వేలం పాటను ముందుకు తీసుకువచ్చారని మండిపడ్డారు. సీపీఐ(ఎం) మంచిర్యాల జిల్లా 3వ మహాసభల సందర్భంగా వేలం పాట రద్దు చేయాలని మొదటి తీర్మానం చేశామని తెలిపారు. సింగరేణికే బొగ్గు గనులు కేటాయించాలని సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టామన్నారు. దీనిలో భాగంగా 5 మైన్స్, వర్క్ షాప్, స్టోర్, జీఎం కార్యాలయంలలో సంతకాల సేకరణ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి 23వ తేదీ వరకు బొగ్గు గనుల్లో కాలనీలలో వ్యాపారస్తులు ప్రజలు, రైతులు, యువకులు, విద్యార్థుల నుండి సంతకాల సేకరణ చేసి గవర్నర్, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి ఇవ్వనున్నట్టు తెలిపారు. సింగరేణి పరిరక్షణకు సీపీఐ(ఎం) చేపట్టిన పోరాటంలో అన్ని వర్గాల ప్రజలు, సంఘాల నాయకులు, రాజకీయ పార్టీలు కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం కనకయ్య, జిల్లా అధ్యక్షుడు సోషలిస్టు పార్టీ (ఇండియా), ముల్కల రాజేంద్రప్రసాద్, బీఎస్పీ చెన్నూర్ నియోజక వర్గ అధ్యక్షులు అల్లి రాజేందర్, ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) మందమర్రి ఏరియా కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

మల్యాల గ్రామస్తులతో డీఎఫ్ఓ సమావేశం



నవతెలంగాణ-జన్నారం

మండంలోని అటవీ ప్రాంతంలో ఉన్న మారుమూల గిరిజన మల్యాల గ్రామస్థులతో జిల్లా అటవీ శాఖ అధికారి శివ ఆశిష్ సింగ్ సమావేశం నిర్వహించారు. సోమవారం ఆయన గ్రామంలో పర్యటించి వారి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆ గ్రామస్థులకు పునరావాస కాలనీలో చేసే ఏర్పాట్లు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మల్యాల గిరిజన గ్రామాన్ని అక్కడ నుంచి తరలించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పునరావాస గ్రామంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలు సమకూరుస్తామని ఆ గ్రామ ప్రజలకు తెలిపారు. ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావు, ఆర్ఐ భానుచందర్, ఎంపీఓ జలంధర్ పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌తో సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-తాండూర్

ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం బెల్లంపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వినోద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఇందులో 250 దరఖాస్తులు అందాయని, 30 దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించడం జరిగిందని, మిగిలిన వాటిని నియోజకవర్గ అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ హరికృష్ణ, ఏసీపీ రవికుమార్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ జ్యోత్స్న, మున్సిపల్ చైర్మన్ జక్కుల శ్వేత పాల్గొన్నారు.

సహకార సంఘాలతోనే వికసిత భారత్

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

గ్రామీణ స్థాయిలో సహకార సంఘాల సేవల ద్వారా వికసిత భారత్‌కు పునాది పడుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని యూనివర్సల్ అర్బన్ సహకార బ్యాంక్ సమావేశ మందిరంలో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా సహకార శాఖ అధికారి బి.సంజీవరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా సహకార మంత్రిత్వ శాఖ ద్వారా 56 అంశాలలో సహకార రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి అందించవలసిన అన్ని రకాల సేవలను అందించేందుకు జిల్లా సహకార శాఖ సిద్ధంగా ఉందని, గోదాములు, పెట్రోల్ బంక్లు, ఖాళీ స్థలాలు అందించేందుకు అనుకూలంగా ఉన్నామని, మహిళా సంఘాలకు సోలార్ పరిశ్రమలు, క్యాంటీన్లు తదితరాలు ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లాలో ప్రగతి కనబరిచిన సంఘాలకు జ్ఞాపికలు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశిష్ట కాకతీయ సహకార శిక్షణ కేంద్రం-వరంగల్ ప్రిన్సిపల్ లూనవత్ యాకూబ్ నాయక్, బ్యాంక్ చైర్మన్ వినయ్‌కుమార్, సీఈఓ మూర్తి, సహకర శాఖ అధికారులు కె.రవీందర్‌రావు, మల్లారెడ్డి, హన్మంతరెడ్డి, రవికిషోర్, సందీప్ కుమార్ పాల్గొన్నారు.



కరాటే పోటీల్లో బోయపల్లి విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ-తాండూర్

ఈ నెల 17 న కాగజ్‌నగర్‌లో నిర్వహించిన 5వ జాతీయస్థాయి కరాటే పోటీల్లో మండలంలోని బోయపల్లి గ్రామానికి చెందిన ఎలిగేటి సురేష్ ప్రతిభ కనబరచి చాంపియన్‌గా నిలిచాడు. బ్లాక్ బెల్ట్ విభాగంలో గ్రాండ్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా సురేష్‌ను మాస్టర్లు ప్రసాద్ విష్ణు, హరికృష్ణ, సంతోష్, జింత్ నరేష్, రమేష్, నరేష్, శేఖర్, వెంకటేష్, లక్ష్మణ్ అభినందించారు.

రైతులు వరి కోసిన తర్వాత కొయ్యలను కాల్చొద్దు

నవతెలంగాణ-జన్నారం

వరి రైతులు తమ పొలంలో వరి కోసిన తర్వాత ఎవరు కూడా పంట మొల్లను, కొయ్యలను కాల్చవద్దుని మండలంలోని కవ్వాల్ క్లస్టర్ ఏఈఓ అక్రమ్ సూచించారు. వరి కొయ్యలను కాల్చడం వలన నేలలో ఉండే సేంద్రియ కార్బనం, పంట పెరుగుదలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు నశించటంతోపాటు పర్యావరణానికి కూడా నష్టం వాటిల్లుతుందన్నారు. పంట అవశేషాలను, వరి కొయ్యలను నేలలో కలియదున్ని సింగిల్ సుపర్ పాస్పెట్ వేయటం ద్వారా మంచి ఎరువుగా తయారై పంట ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. దీంతో నేల సారవంతమవుతుందన్నారు. పంట అవశేషాలు, వరి కొయ్యలను కాల్చిన పర్యావరణ కాలుష్యానికి పాల్పడిన పభుత్వం చట్ట రీత్యా చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.

నూతన ఏజెంట్‌ను సన్మానించిన సీఐటీయూ నాయకులు



నవతెలంగాణ-నస్పూర్

ఇందారం ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి బదిలీపై శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్‌గా వెంకటేశ్వర్లు వచ్చిన సందర్భంగా సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) శ్రీరాంపూర్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సెక్రటరీ వెంగళ శ్రీనివాస్, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ సుధాకర్, ఆర్గనైజర్స్ సాయిల శ్రీనివాస్, మేల్లం శ్రీధర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన డీఆర్‌డీఓ



నవతెలంగాణ-హాజీపూర్

పడ్తనపల్లి ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు కేంద్రంలో ఉండాల్సిన సౌకర్యాలను వివరించారు. అనంతరం ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో తూకం వేసే మిషన్, గన్ని సంచులు, ప్యాడి క్లీనర్ లాంటివి అన్ని ఏర్పాటు చేశామని అన్నారు. పడ్తనపల్లి ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 37 మంది వరి ధాన్యం ఆరబోసుకున్నారని, అందులో ముగ్గురివి మాత్రమే 17 తేమ శాతం వచ్చాయని, మిగతా వారివి తేమ శాతం రాలేదని తెలిపారు. తేమ శాతం వచ్చిన రైతుల వరి ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయడానికి సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు నియోజక వర్గంలోని అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సన్న రకం ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు గన్ని సంచులపైనా "ఎస్" అనే అక్షరంతో పాటు కొనుగోలు కేంద్రం కోడ్ రాయాల్సి ఉంటుందన్నారు. అలాగే మిల్లర్లకు సన్న ధాన్యం బస్తాలు తెలిసేందుకు ఎరుపు రంగులో సుతిలిని ముంచి బస్తాలకు కుట్టు వేయాలని సూచించారు. దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు గన్ని సంచులకు సుతిలి దారాన్ని ఆకుపచ్చని రంగులో ముంచి బస్తాలకు కుట్టు వేయాలని సూచించారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2320 తో పాటు క్వింటాకు రూ.500 బోనస్ పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీకళ, తహశీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్పాండే, మండల వ్యవసాయ అధికారి కృష్ణ, ఐకేపీ ఏపీఎం రాజన్న పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్ష

నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని వేంపల్లిలోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో రెండు రోజుల పాట జరిగిన గ్రూప్-3 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొదటి రోజు 264 మంది అభ్యర్థులకు 41 మంది గైర్హాజరు కాగా 223 మంది పరీక్ష రాశారు. రెండవ రోజు సోమవారం మరో ఇద్దరితోకలిసి మొత్తంగా 43 మంది గైర్హాజరు కాగా 221మంది పరీక్ష రాశారు. పరీక్ష ముగిసిన అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్పాండే పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు మధ్య పరీక్షా జవాబు పత్రాలను ఐడీఓసీలోని స్ట్రాంగ్ రూంకు తరలించారు. 144 సెక్షన్, 163 బీఎన్ఎస్ సెక్షన్లను పరీక్షా కేంద్రం వద్ద అమలు చేయగా మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

గుండ్లపాడ్ గుట్ట తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి శివారులోని గుండ్లపాడ్ చిన్న గుట్టను తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని సామాజిక ప్రజా స్పందన కన్వీనర్ సిలోజు మురళీ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సింగరేణి యాజమాన్యం చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులకు అక్రమంగా మట్టి తవ్వకాలు చేయగా తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వడంతో తవ్వకాలను నిలిపివేశారన్నారు. ప్రస్తుతం రైల్వే పనులకు ఈ గట్టు నుంచి మట్టిని తరలిస్తున్నారని, దీనిపై తహసీల్దార్, భూగర్భ శాఖ అధికారుల నుంచి మట్టి తవ్వకాలపై అనుమతులు ఉన్నాయని సదరు కాంట్రాక్టుకు సంబంధించిన వ్యక్తులు దబాయిస్తున్నారని, దీనిపై తహసీల్దార్ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ముత్యంపల్లి శివారులోని చిన్న గుట్ట పూర్తిగా ఏజన్సీ గ్రామమని, చట్టాలను ఉల్లంఘించి విధ్వంసానికి ప్రోత్సహించడం గిరిజన చట్టాలను ఉల్లంఘించడమేనన్నారు. గ్రామ సభ ద్వారా ప్రజాభిప్రాయం మేరకు నిర్ణయాలు తీసుకోవాలని, స్వంత నిర్ణయింతో అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే అనుమతులు రద్దు చేసి పర్యావరణాన్ని రక్షించాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్ష

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో రెండు రోజుల పాటు నిర్వహించిన గ్రూప్-3 పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌బీహెచ్‌వీ, ఎస్ఆర్‌డీజీ పాఠశాలలు, హాజీపూర్ మండలం వేంపల్లిలోని ఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-3 పరీక్షలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగంగా అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందని, 48 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష ఆఖరి రోజు 8 వేల 185 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి ఉద్యోగులకు యాజమాన్యం మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ అన్నారు. సోమవారం ప్రగతి స్టేడియంలోని వాకింగ్ ట్రాక్, నస్పూర్ కాలనీలోని ఆధునీకరిస్తున్న సీఈఆర్ క్లబ్ పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులకు సంస్థ అన్ని మౌళిక సదుపాయాలను కల్పిస్తుందని, ప్రగతి మైదానంలో ఆధునీకరిస్తున్న వాకింగ్ ట్రాక్ మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేయాలని, అలాగే స్టేడియంలో వర్షం నీరు నిలవకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులకు నస్పూర్ కాలనీలోని సీఈఆర్ క్లబ్ వివిధ ఫంక్షన్లు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని అందువలన వీలైనంత త్వరగా మరమ్మత్తు పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, సివిల్ ఇంజనీర్లు గుండె రావు, సత్యనారాయణ, సీనియర్ పీఓలు పి కాంతారావు, పాల్ సృజన్ పాల్గొన్నారు.

ప్రమాద బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

శాలరీ ఎకౌంటు ఖాతాలు కలిగి ఉండి ప్రమాద బీమా సౌకర్యాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని డీజీఎం పర్సనల్ అరవిందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కెనరా బ్యాంకులలో సింగరేణి ఉద్యోగులకు ఏదైనా ప్రమాదం సంభవించినట్లయితే వారి కుటుంబానికి ప్రమాద బీమా అందించే మంచి ఉద్దేశంతో ఆయా బ్యాంకులలో జీతం ఖాతా కలిగిన ఉద్యోగులకు ప్రమాద బీమా వర్తించే విధంగా ఒప్పందం చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు చాలామంది ఆయా బ్యాంకులకు తమ ఖాతాలను మార్చుకోవడం జరిగిందని, శ్రీరాంపూర్ ఏరియాలో 341 మంది ఉద్యోగులు ఎటువంటి ప్రమాద బీమా సౌకర్యం లేనటువంటి బ్యాంకులలో ఖాతాలు కలిగి ఉన్నారని తెలిపారు.

సివిల్ సర్వీసెస్‌పై విద్యార్థుల అవగాహన



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని స్టేట్ హై స్కూల్, స్టేట్ ఎక్సలెన్స్ పాఠశాలల్లో సోమవారం ఆ విద్యార్థులకు సివిల్ సర్వీసెస్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రముఖ పండితుడు విద్యావేత్త నారోజు శంకర్‌చారి, విద్యార్థులకు సివిల్ సర్వీసులలో రాణించడానికి కావలసిన విలువైన సమాచారాన్ని అందించారు. విద్యార్థులను సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో, ప్రణాళికాబద్ధంగా ఎలా ముందుకు సాగాలో వివరించారు. క్రమశిక్షణ, నిరంతర ప్రయత్నం, దేశ సేవ పట్ల ఆసక్తిని పెంపొందించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల కరస్పాండెంట్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి ప్రిన్సిపాల్ షిరిన్ ఖాన్, శ్యామ్ లాల్ పాల్గొన్నారు.

పొన్కల్ సింగిల్ విండో సొసైటీకి ఉత్తమ అవార్డు

జన్నారం : జిల్లాలో రైతు సేవలో ముందున్న మండలంలోని పొనకల్ సింగల్ విండో సొసైటీకి ఉత్తమ అవార్డుతో పాటు ప్రశంసా పత్రం దక్కింది. ఈ మేరకు కలెక్టర్ కుమార్ దీపక్, డీసీఓ సంజీవరెడ్డి చేతుల మీదుగా సోమవారం సొసైటీ చైర్మన్ అల్లం రవి, కార్యదర్శి కావటి రాజన్నకు అవార్డుతోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | నవంబర్ 19, 2024 | www.navatelangana.com

నిరుపేద కుటుంబానికి అండగా బీఆర్ఎస్

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని టీజీపల్లి గ్రామానికి చెందిన మాధంశెట్టి అశోక్ ఇటీవలే గుండెపోటుతో మరణించగా, సోమవారం వారి ఇంటికివెళ్లి పరామర్శించి, ఈ నెల 23వ తేదీన నిర్వహించే ఖర్మ కార్యక్రమానికి తమ వంతుగా 50 కేజీల బియ్యాన్ని అందజేసినట్టు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోడి సృజన్ తెలిపారు. ఆ పేద కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారి వెంట యువ నాయకులు పంచేర్పుల మహేష్, కొట్టే హరికృష్ణ, పెట్టెం మధుకర్ ఉన్నారు.

స్పాట్ అడ్మిషన్ల ద్వారా పీజీలో ప్రవేశాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్ల ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పీజీ కోఆర్డినేటర్ రాజ్ కుమార్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జగ్రామ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఎంఎస్సీ బోటనీలో 24 సీట్లు, ఎంఎస్సీ జులాజీలో ఒక సీటు అందుబాటులో ఉందన్నారు. సీటు పొందలనుకునే విద్యార్థులు సీపీజీఈటీలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. డిగ్రీ పాసైన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. స్పాట్ ద్వారా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ రాదని, అలాగే ప్రాసెసింగ్ ఫీజు రూ.2100, ట్యూషన్ ఫీజు రూ.35800 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఒక సెట్ జిరాక్స్ డిగ్రీ మేమో, ప్రొవిజనల్ సర్టిఫికెట్‌తో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. దరఖాస్తుకు ఈ నెల 20 వరకు అవకాశం ఉందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగోన్నతిపై వెళ్తున్న అధికారికి సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్‌గా పనిచేసే గోపాలసింగ్ ఆర్జీవన్ ఏరియాకు ఉద్యోగోన్నతిపై ఎస్ఓ టు జీఎంగా వెళ్తున్న సందర్భంగా టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాధుల భాస్కర్, వెంకట్‌రెడ్డి, నరేష్, జంగా తిరుపతిరెడ్డి, గంగాధర్, సాయి, శ్రీనివాస్, రాజయ్య రాజేశం, అల్లం రాజయ్య రమణరెడ్డి, చెంద్ర మొగిలి, రంజిత్, కార్తీక్, సిరాజ్ పాషా, సాయి, మల్లేష్, జంగా సంతోషం, చంద్ర మొగిలి, రవి పాల్గొన్నారు.

డీటీడబ్ల్యూఓగా అంబాజీ బాధ్యతలు



నవతెలంగాణ-నస్పూర్

జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఇన్‌చార్జి అధికారిగా జె.అంబాజీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అంబాజీ నిర్మల్ జిల్లా గిరిజనాభివృద్ధి అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

నేడు జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా విద్యా క్రీడ శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 19 మంగళవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉదయం 10:30 గంటలకు అండర్ 17 బాలుర జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలకు హాజరయ్యే విద్యార్థులు బోనఫైడ్ ఆధార్ కార్డులతో పోటీల ఆర్గనైజర్ పార్థసారథి రిపోర్ట్ చేయాలని సూచించారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థులు ఎవరి కిట్ వారే తీసుకొని రావాలన్నారు. 1-1-2008 తర్వాత పుట్టిన వారు అర్హులని స్పష్టం చేశారు.

రోడ్డుప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలైన ఘటన సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన అనిత తాంసి రైల్వే గేట్ వద్ద సాయంత్రం కాలినడకన వెళ్తోంది. ఓ గుర్తు తెలియని టిప్పర్ లారీ ఆమె కాళ్లపై నుంచి వెళ్లింది. దీంతో ఆమె ఒక కాలు నుజ్జునుజ్జు అయి తీవ్రగాయాలపాలైంది. వెంటనే గమనించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఈ క్రమంలో అక్కడ ట్రాఫిక్ జామ్ అయింది. అంబులెన్స్ ఘటన స్థలానికి రాగ గాయపడ్డ మహిళను రిమ్స్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది.

పుట్టమధు హత్యకు కుట్రపై బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

నవతెలంగాణ-మంథని

మంథని మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గం ఇన్‌చార్జి పుట్ట మధుపై జరిగిన హత్య కుట్రపై సుమోటోగా కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కమాన్‌పూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.చల్లా నారాయణ రెడ్డి 2014కు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రిగా కొనసాగుతున్న శ్రీధర్ బాబు,సోదరుడు శ్రీను బాబుల ఆదేశాల మేరకు పుట్ట మధుపై దాడి చేసేందుకు వెళుతున్న తరుణంలో యాక్సిడెంట్ కావడంతో తనకు జ్ఞానోదయమై విరమించుకున్నామని అప్పటి శ్రీధర్ బాబు అనుచరుడు చల్లా నారాయణ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సుమోటోగా కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షులు తాటికొండ శంకర్,యూత్ మండల అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు కొండ వెంకటేష్ ఉన్నారు.

వరి కొయ్యలను కాల్చకండి

ఓదెల : ఓదెల మండలం కొలనూర్,ఓదెల గ్రామాల్లో వరిపంట కోసిన పంట క్షేత్రాలను సోమవారం పెద్దపల్లి డివిజన్ ఏడీఏ శ్రీనాథ్ మండల వ్యవసాయ అధికారి భాస్కర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ రైతు సోదరులు వరి పంట కోసిన తరువాత వరి కొయ్య లను నిప్పంటించి కాలుస్తున్నారు.పంట కోసిన కొయ్యలను కాల్చడం వలన భూమి లో వుండే వ్యవసాయ మిత్ర పురుగులు,సూక్ష్మ జీవులు నశిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భాస్కర్,ఏఈవో రాకేష్, సంధ్య రైతులు ఉన్నారు.

జీఓ ప్రకారం రూ.26వేల వేతనం ఇవ్వాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సుప్రీం కోర్టు జీఓ ప్రకారం గ్రామపంచాయతీ కార్మికులకు రూ.26 వేల వేతనం చెల్లించాలని గ్రామపంచాయతీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పాండు కోరారు. నూతనంగా వచ్చిన పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సృజన మర్యాదపూర్వకంగా కలిసి గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించడంతో పాటు సుప్రీం కోర్టు జీఓ ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ప్రతినెల ప్రభుత్వ గ్రాంట్ ద్వారా ఒకటో తారీకు వేతనాలు చెల్లించాలన్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్‌కి స్పెషల్ స్టేటస్ కల్పించాలని, వచ్చే పీఆర్సీలో గ్రామపంచాయతీ కార్మికులకు వర్తింపచేయాలని విన్నవించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.ఐదు లక్షల ఇన్సూరెన్స్ పూర్తిస్థాయిలో అమలు చేయాలని, విధి నిర్వహణలో మరణించిన కార్మికునికి రూ.10 లక్షలు పరిహారం ప్రభుత్వం చెల్లించాలని కోరారు. 2019లో పనిచేసిన గ్రామపంచాయతీ సిబ్బంది పేర్లు మాత్రమే మల్టీపర్పస్‌గా ప్రభుత్వ రికార్డులో ఉన్నాయని ప్రస్తుతం 2024 వరకు పనిచేస్తున్న నూతనంగా నియమించిన సిబ్బంది పేర్లను మల్టీపర్పస్‌గా గుర్తించి ప్రభుత్వ రికార్డులు నమోదు చేయాలని, మల్టీపర్పస్ సిబ్బందితో సమానంగా ఒకటో తారీకు వేతనాలు ఇవ్వాలన్నారు. సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ తొందర్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, రాష్ట్ర కార్యదర్శి పెరిక శ్రీకాంత్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్యనందించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలందరికీ కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలని డీఎస్పీ అధ్యక్షులు గణేష్ మహరాజ్ అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 90శాతంపైన పేద, మధ్యతరగతి వర్గాలున్నాయన్నారు. వీరు ప్రధానంగా విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించి, సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించి ప్రాణాలను కాపాడాలన్నారు. ప్రతీ గ్రామంలో 'ఆధునిక హాస్పిటల్' నిర్మించాలన్నారు. అర్హులైన వారందరికీ సాగునీటి సౌకర్యంతో ఎకరం వ్యవసాయ భూమిని, 200 గజాల స్థలంలో నాలుగు గదుల ఇల్లుని నిర్మించి ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, పార్టీ నాయకులు అన్నెల, అడెల్లు, చీటి వెంకటేష్, రామ్‌చందర్, నవీన్, సాయికుమార్, వినుకుమార్, ప్రజ్ఞాన్, అంజన్, రవి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను విడుదల చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను విడుదల చేయలని ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్, డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. సోమవారం ఇదే విషయమై కలెక్టరేట్ ఏఓ మధుకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలో సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద దళిత పిల్లలు 19వేల మంది, గిరిజన పిల్లలు 6 వేలమంది మొత్తం 25 వేలమంది చదువుకుంటున్నారని తెలిపారు. ప్రతి ఏటా ఫీజులు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా రూ.175 కోట్లు చెల్లించడం లేదన్నారు. దీంతో దళిత గిరిజన విద్యార్థులు చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 8నెలలు చెల్లించలేదని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఈ బిల్లులు చెల్లించకపోవడంతో పేద విద్యార్థుల తమ చదువులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు పిల్లలకు వసతి, భోజనాలు కూడా పెట్టలేకపోతున్నామని తమ గోడును వెల్లబోసుకుంటున్నారన్నారు. ఈ స్కీం క్రింద చదువుతున్న విద్యార్థుల ఫీజులను తల్లిదండ్రులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ప్రభుత్వం నుండి బకాయి పడ్డ రూ.175 కోట్లను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఛాప్లె సాయి, రాష్ట్ర నాయకులు రమేష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గేడం టికనంద్ పాల్గొన్నారు.

విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, ప్రభుత్వం చేపట్టిన గ్యారంటీ పథకాలు మహాలక్ష్మి, మహిళలకు ఉచిత బస్సు, గృహ జ్యోతి, చేయూత పింఛన్లు, రైతు రుణమాఫీ, ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలపై ఈ నెల 19 నుండి డిసెంబర్ 7వ తేదీ వరకు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రతి మండల కేంద్రంతో పాటు ఆ మండలంలోని 2 గ్రామాల్లో కార్యక్రమాలు చేపట్టాలని, గ్రామస్థాయిలో అన్ని శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ నెల 23న జిల్లా కేంద్రంలో 80 మంది కళాకారులతో కూడిన సాంస్కృతిక బృందంతో నిర్వహించే కార్యక్రమాలకు అనువైన ప్రదేశాన్ని గుర్తించి, పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో ప్రజాపాలన విజయోత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

నవతెలంగాణ-నస్పూర్



ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను అధికారులు సమన్వయంతో పని చేసి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాస్రావులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

- పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ సాఫీగా పరీక్షలు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. సోమవారం జరిగిన పరీక్షకు జిల్లాలో మొత్తం 8,124 మంది అభ్యర్థులకు గాను, 4,665 మంది హాజరు కాగా, 3,459 మంది గైర్హాజరు అయ్యారని వివరించారు. సగటున 57.42 శాతం హాజరు నమోదయ్యిందని తెలిపారు. పరిశీలనలో రీజినల్ కోఆర్డినేటర్ పిజి రెడ్డి, డిపార్ట్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, పట్టణ తహసిల్దార్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

టెట్ అభ్యర్థులకు ఎడిట్ ఆప్షన్‌కు అవకాశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో టెట్ పరీక్ష రాసే అభ్యర్థులకు అప్లికేషన్‌లో ఎటువంటి తప్పులు, పొరపాట్లు ఉన్నా సవరణ చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఈనెల 16 నుండి 22 వరకు డబ్ల్యుడబ్ల్యు.స్కూల్ఎడ్యు.తెలంగాణ.గౌ.ఇన్‌లో చేసుకోవాలని సూచించారు. ఒక వేళ ఏదైనా టెక్నికల్ సమస్య ఎదురైతే 7032901383, 9000756178 నెంబర్లకు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించవచ్చని సూచించారు.

అందుబాటులో జింక్ గోధుమ

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలో బిహెచ్‌యు 31 జింక్ గోధుమ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్ని సీఈఓ కాంబ్లె ప్రజ్ఞశీల్ తెలిపారు. అన్ని రకాల నేలలకు అనుకూలంగా ఉండే ఈ విత్తనాలు అధిక దిగుబడి ఇస్తాయని, ఇవి అధిక పోషక విలువలు కలిగి ఉన్నాయని తెలిపారు. మార్కెట్ ధర కన్నా తక్కువ ధరకు 20కేజీల సంచి కేవలం రూ.1170 రైతులకు అందిస్తున్నామని పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన వారు మండలం కేంద్రంలోని వెలుగు తల్లి మండల సమాఖ్య కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు, రైతులు నేరుగా 9110395366లో సంప్రదించాలని సూచించారు.

వరి కొయ్యలను తగలబెట్టొద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వరి కోతల తర్వాత వరి కొయ్యలని తగలబెట్టడం ద్వారా వాతావరణ కాలుష్యంతో ఊపిరితిత్తులలో వాయుసబంధ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెలలో సారం దెబ్బ తింటోందని నెలలో సూక్ష్మ జీవులు దెబ్బ తిని జీవవైవిధ్యం దెబ్బ తింటుందని పేర్కొన్నారు. కావున పంటతీసిన తర్వాత వరి కొయ్యలని కలియదున్నట ద్వారా నెలలో సారం పెరుగుతుందని కావున వరి కోతల తర్వాత సింగల్ సుపారీ ఫాస్ఫేట్‌ని నెలలో వేయటం ద్వారా వరికొయ్యలు త్వరగా కుళ్లి నేలలో కలిసిపోయే ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. కావున ఈ సూచనలు జిల్లా రైతాంగం పాటించి పర్యావరణనికి తమ నేలలకి మేలు చేసినవారు కావాలన్నారు.

సమస్యలు పరిష్కరించాకే ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి

నవతెలంగాణ-గోదావరిఖని

సమస్యలు పరిష్కరించాకే ప్రజాభిప్రా య సేకరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షకు సోమవారం పెద్ద పల్లి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రాన్ని అందజేశారు.ఎన్టీపీసీ భూని ర్వాసిత, ప్రభావిత ప్రాంతాలైన మల్యాపూర్, నర్రశాలపల్లి గ్రామాల భూనిర్వాసితుల కుటుంబాలకు పూర్తి స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి, స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కారం చేశాకే 800 మెగావాట్లు మూడు విద్యుత్ యూనిట్ల ప్రాజెక్టుకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని వినతి ద్వారా కోరారు.

చిన్నారులకు ప్రతిరోజు పౌష్టికారాన్ని అందించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ప్రతిరోజు పౌష్టికారాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎంఏ ఫహీం అధికారులను ఆదేశించారు. సోమవారం ఆదిలాబాద్‌లో పర్యటించిన అనంతరం నిర్మల్ పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీలలో పిల్లల హాజరు పరిశీలించి, చిన్నారులకు ఇస్తున్న ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించాలని ఆదేశించారు. కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.